ప్రతి ఇంటికి వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలందిస్తాం

మంత్రి డా.సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస : అర్హులైన ప్రతి ఇంటికి వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో 26వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజ సమస్యలను వినతిపత్రాల ద్వారా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి డా.సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి చెందిందని అన్నారు. 2024 జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేసి మళ్లీ ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్లు బోర క్రిష్ణారావు (బుజ్జి), మీసాల సురేష్, వైసీపీ నాయకులు భవానీశంకర్, గార రాజారావులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మెనును తప్పని సరిగా పాటించి రుచికరంగా వండి పెట్టాలని సర్పంచ్ గొండుచాందిని మురళి అన్నారు. గురువారం మండలంలోగల దంత ప్రాథమికోన్నత పాఠశాలను సర్పంచ్ గొండు చాందిని మురళీ సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులుకు జగనన్న గోరు ముద్ద మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ వంటవారికి పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని సిబ్బందిని ప్రసంచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణ రావు, సర్పంచ్ ప్రతినిధి గొండు మురళి, చైర్మన్ లావేటి సింహాచలం, సహోపాధ్యాయులు జగన్మోహన్ రావు, రమణ, జ్యోతిలు పాల్గొన్నారు.

తెలుగు సమాజాన్ని జాగృతపరిచిన మహాకవి వేమన : కలెక్టర్

ఘనంగా వేమన జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : తెలుగు సమాజానికి తన పద్యాల ద్వారా వెలుగులు నింపిన వేమన అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. తెలుగు సమాజానికి తన పద్యాల ద్వారా వెలుగులు నింపిన వేమనకు కొండంత వెలుగును ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 19వ తేదీన వేమన జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తన కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేసిన కవి యోగి వేమన అన్నారు. వేమన పద్యం ఒక్కటైనా రాని తెలుగువారు ఉండరు. తెలుగు జాతి ఉన్నంతకాలం వేమన పద్యాలు ప్రజల నాలుకలపై నిలిచే ఉంటాయన్నారు. తెలుగు భాషలో, భావంలో ప్రజలకు సాహిత్యాన్ని చేరువ చేసిన ఘనత వేమనదేనన్నారు సమాజంలోని అన్ని అసమానతలు పోయి మనుషులు మానవీయంగా ఎదగాలని వేమన ఆశయం అన్నారు. తొలుత ఇంటేక్ అదనపు కన్వీనర్ వి.జగన్నాథం నాయుడు యోగి వేమన జీవితంలో పలు అంశాలు వివరించారు. యుగ కర్త మహాకవి వేమన ఆటవెలది పద్యాలు అచ్చమైన తెలుగులో తాళపత్రాలపై రచించారన్నారు. వేమన ఆలోచనలని, భావలను ప్రజలకు తెలియ జేసిన ఖాతీ బ్రౌన్‌దే అన్నారు. ప్రతి ఇంటిలో సుమతీ శతకంతోపాటు వేమన శతకం ఉండాలన్నారు. నేటి పిల్లలు రోజుకి ఒక వేమన పద్యం నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరీ, మెప్మా పి.డికిరణ్ కుమార్, యూత్ కోర్డినేట్ ఉజ్వల్, జిల్లా టూరిజం అధికారి నారాయణ రావు, ఎస్.ఈ కార్పొరేషన్ ఈ.డి రామారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాల మాన్ సింగ్, హెచ్ సెక్షన్ సూపరెంటెండెంట్ రాజేశ్వరరావు, కలెక్టర్ కార్యాలయ ఆవరణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం పొందే విధంగా పనులు చేయండి : డ్వామా పీడీ

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట/హిరమండలం: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు పనులకు రావాలని, అదేవిధంగా అందరూ గరిష్ట వేతనం పొందే విధంగా నాణ్యమైన పనులను చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జివి చిట్టి రాజు కోరారు. గురువారం ఎల్ ఎన్.పేట మండలంలోని శ్యామలాపురం, హిరమండలం మండలంలోని కొండరాగోలు పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పిడి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు సమయపాలన పాటించాలని, రెండు పూటలా విధిగా పనులకు వచ్చి కనీసం 6 గంటల సమయం పనులు చేసినట్లయితే గరిష్ట వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఉపాధి హామీ పథకం మీ సొంత పథకం లాంటిదని ఈ పథకంలో మీరే యజమానులని ఆయన పేర్కొన్నారు. జిల్లా వాసులు కష్ట జీవులని, ఈ జిల్లాకు ఉపాధి హామీ పథకం ఒక వరప్రదాయని వంటిదని ఆయన అన్నారు. హాజరు పట్టీలను ఎన్ ఎం ఎం ఎస్ యాప్ ద్వారా మాత్రమే పంపించాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు పని ప్రదేశంలో రెండు పూటలు వేతనదారులు పనిచేస్తున్న ఫోటోలను యాప్ ద్వారా అప్లోడ్ చేయాలని సూచించారు. అనుప్రదేశాల్లో కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు నీరు, నీడ, ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. లేబర్ బడ్జెట్ ప్రకారం ఎస్టిమేషన్లు తయారు చేయాలని కోరారు. కార్యాలయానికి సమస్యల పరిష్కారానికి వచ్చిన వారిపట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ మరియు మండల స్థాయిలో అన్ని రకాల అధికారులను అప్డేట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడి రవి, ఏపీఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, క్లస్టర్ టిఏ రవి, టెక్నికల్ అసిస్టెంట్ శంకర్రావు, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నగదు గల్లంతుపై బ్యాంకు మేనేజర్‌కు వినతి

విశాలాంధ్ర-కవిటి : బ్యాంకు ఖాతాల్లో నగదు గల్లంతు కావడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల మళ్లీ పలువురు ఖాతాలో నగదు పోవడంతో వారంతా బ్యాంకు వద్ద ఆందోళన దిగారు. విషయం తెలుసుకున్న ఇచ్చాపురం నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ళ రాజేష్ కవిటి స్టేట్ బ్యాంకు గురువారం వెళ్లి అధికారులకు సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఖాతాదారులకు అన్యాయం జరగదని మేనేజర్ అశోక్ కుమార్ హామీ ఇచ్చారు. ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. నగదు గల్లంతుపై విచారణ జరుగుతుందని, ఖాతాదారులకు నగదు త్వరలో జమ చేస్తామని హామీ ఇచ్చారు.

గృహ లబ్ధిదారుల సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరు

- సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి
- టిడ్కో, జగనన్న గృహాల లబ్ధిదారుల సంతకాల సేకరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : టిడ్కో, జగనన్న కాలనీల గృహాల లబ్ధిదారుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ సీపీఐ పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపులో బాగంగా గురువారం శ్రీకాకుళం నగరంలోనీ పలు కూడళ్లులో ఫిబ్రవరి 22న విజయవాడలో నిర్వహించనున్న మహ ధర్నా కరపత్రాలను పంచి విస్తృత ప్రచారం చేశారు. అనంతరం గృహ లబ్ధిదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి సంతకాలను సేకరించారు. ఈసందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ స్వంత ఇంటి కల కోసం పేదలు పడరాని పాట్లు పడుతున్నారని, జగనన్న కాలనీల గృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు సరిపోక అప్పులుచేసి నిర్మిస్తున్నారని, వారికి ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇస్తూ కనీసం మరో 5 లక్షలు ఇవ్వాలని ఆయన కోరారు. ఆ కాలనీల్లో కనీస మౌలిక వసతులు అయిన డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, రోడ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు ఇళ్ళ కోసం అప్పులు చేసి మరీ డబ్బులు కట్టారని ఇప్పటివరకు వారికి ఇల్లు ఇవ్వక పోవటంతో ఒక వైపు అద్దెల బాధలు తప్పక, మరోవైపు తీసుకున్న డబ్బులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధి దారులు వాపోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం పేదల ఇళ్ళ విషయం లో రాజకీయాలను పక్కన పెట్టీ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. తదితర సమస్యల మీద సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపులో బాగంగా ఈ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తూ, ఈనెల 30న ఈ లబ్ధి దారులతో కలిసి అన్ని మండల తహశీల్దార్ కార్యాలయంల వద్ద ధర్నా నిర్వహించి లబ్ధిదారుల సంతకాలతో కూడిన వినతి పత్రాలు ఇస్తామని, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం దిగి రాకుంటే ఫిబ్రవరి 22న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని మన సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్ళేలా జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ పేదల ఇంటి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరు ఆపదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహా దారు చిక్కాల గోవిందరావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పట్టా ప్రభావతి, జట్టు కళాసీ యూనియన్ నాయకులు నక్క వేణు, రైతు సంఘం నాయకులు అప్పారావు, మహిళా సంఘ నాయకురాలు నీలవేణి, తోనంగి అప్పారావు, ముద్దాడ రాము, జగ్గారావు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ

విశాలాంధ్ర-కవిటి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్ఆర్ సిపి సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం భాగంగా కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణ రావు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ-2 పరిధిలో కే కొత్తూరు గ్రామంలో 8, 9, 10, 13 వార్డుల్లో గురువారం వైకాపా నాయకులు ఇంటింటా పర్యటించారు. సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శాడి శ్యాంప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ దుక్క లోకేస్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్,కంచిలి మండల ఎంపిపి పైలా దేవదాస్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఎంపీటీసీలు పూడి నీలాచలం, దుద్ది ధర్మారావు, బోరివంక సర్పంచ్ బెందాలం శ్రీరామ్ ప్రసాద్,వై ఎస్ రమణ, తిలక్, ఎన్.బాబురావు, ఎన్ని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో ఉత్తరాంధ్ర రచయితల సభలు

విశాలాంధ్ర-పలాస : ఈనెల 21,22 తేదీల్లో ఉద్దాన సాహితీ సంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పలాసలో ఉత్తరాంధ్ర రచయితల సభలు జరుగుతాయని, ఉత్తరాంధ్ర రచయితలు, సాహితీ వేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఉద్దాన సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలోనాటక కళారూపాలు, యాష, భాషా, జానపదాలు, ఉద్దానం ఉద్యమాలు, నేటి ప్రసంగీకత వంటి అంశాలపై చర్చలుంటాయని తెలిపారు.

పనులు పూర్తి చేయటంలో నిర్లక్ష్యం తగదు

- అన్ని శాఖల అధికారులతో అభివృద్ధిపై సమీక్ష
- పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస నియోజకవర్గ పరిధి మండ లాలైన ఆముదాలవలస సరుబుజ్జిలి, బూర్జ పొందూరు గ్రామాల్లో నిర్దేశించిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని శాసనసభాపతి తమ్మినేని సీతారాం కోరారు. శుక్రవారం తన నివాసంలో పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధిలో ఇంజ నీరింగ్ శాఖ అధికారులు భాగస్వామ్యం కావాల్సిందే నని స్పీకర్ తేల్చి చెప్పారు. పనులు జరుగుతున్న తీరును నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన కోరారు. దీనివలన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించటం ద్వారా, దీర్ఘకాలికంగా మన్నికగా నిలుస్తాయన్నారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పనులను అసంపూర్తిగా చేపట్టడం సరికాదన్నారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు సకాలంలో స్పందించుకుంటే నోటీసు జారీ చేసి, పనులు వేగవంతం అయ్యేలా చూడాలని ఆయన సూచించారు.గ్రామీణ ప్రాంతాలను అనుసంధా నించే రోడ్ల నిర్మాణం పట్ల జాప్యం వలన, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. హౌసింగ్‌పై వాడివేడిగా సమీక్ష జరిగింది. ఇప్పటివరకు జగనన్న కాలనీలు నియోజక వర్గంలో నిర్దేశించిన ప్రాంతాల్లో ఎన్ని పూర్తయ్యాయని అధికారులను ప్రశ్నించారు. పనులు నత్తనడకన సాగడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరికాదని, పద్ధతి మార్చుకోవాలని కోరారు. కొన్ని కాలనీలకు ఇప్పటికీ విద్యుత్ సదుపాయాలు కల్పించేందుకు విద్యుత్‌శాఖ అధికారులను సమన్వ యం చేసుకోవాలని కోరారు. ప్రతి కాలనీకి అవసరమయ్యే మౌలిక వసతుల సదుపాయాలు కల్పించాలని సూచించారు. 90 రోజుల్లో ఇళ్ల పట్టాల కోసం అర్జీ పెట్టుకున్న లబ్ధిదారులకు స్థలాన్ని గుర్తించి వెంటనే అందేవిధంగా చూడాలన్నారు. ఇంటింటికి మంచి నీటి కొళాయి కల్పనలో భాగంగా పనులకు నియోజకవర్గంలో శంకుస్థాపన చేసిన పనులు ఏమేరకు పూర్తయ్యాయో ఆర్డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామం లోనూ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక చర్యలకు ఉపక్రమించింద న్నారు. వేసవి కాలం ప్రారంభ మయ్యే నాటికి, నియోజక వర్గంలో ఏ గ్రామంలో కూడా నీటిఎద్దడి తలెత్త కుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులకు ఉందన్నారు. ప్రారంభించిన పనులకు యుద్ధప్రాతిపదికన పూర్త య్యేలా చూడాలని అధికారులకు స్పీకర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ గణపతి, ఎస్ ఈపిఆర్‌వియస్‌ఎన్ మూర్తి, ఈఈ గిరిధర్, పొందూరు జడ్పీటిసి లొలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడన సునీల్, సూర్యారావు, తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణను పౌర సరఫరాల శాఖ పరిశీలన

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలంలో కనీస మద్దతు ధరకు ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను పౌరసరఫరాల శాఖజిల్లా మేనేజర్ యం.జయంతి పరిశీలించారు. ముందుగా స్థానిక రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వద్ద మిల్లుల నుంచి వస్తున్న బియ్యం దిగుమతి పరిశీలించి స్థానిక ధాన్యం మిల్లును సందర్శించారు. రైతు భరోసా కేంద్రాల నుంచి ఆలస్యంగా వస్తున్నందుకు కారణాలు విచారించారు. మిల్లులు, రైతు భరోసా కేంద్రాల ధాన్యం త్వరగా మిల్లు చేసి బియ్యం ప్రభుత్వానికి అందించాలని, నిత్యం ప్రక్రియను పరిశీలించాలని పౌర సరఫరా ఉప తహశీల్దార్‌ను కోరారు. ఈ ఏడాది వరి దిగుబడులు గణనీయంగా పెరిగి ఎకరానికి 30 బస్తాలు వరకు ఉన్నందున ఆ మేరకు రైతు భరోసా కేంద్రాల కొనుగోలు సామర్థ్యం పెంచాలని మండల వ్యవసాయాధికారి విన్నవించారు.

కంకర రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద కంకర రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు భూమిపూజ చేశారు. తామాడ చంద్రయ్య తోట నుంచి నర్తు అనసూయమ్మ తోట వరు సుమారు కిలోమీటరు కంకర రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గూడ భాస్కరరావు, ఎరిపల్లి ధర్మారావు, ఫీల్డ్ అసిస్టెంట్ ముణి, టెక్నికల్ అసిస్టెంట్ పాపారావు, అప్పలస్వామిలు పాల్గొన్నారు.

అచ్చన్నను కలిసిన కలమట సాగర్

విశాలాంధ్ర-కొత్తూరు : తెలుగుదేశం నియోజకవర్గ పార్టీ పరిశీలకుల రాష్ట్ర స్థాయి సమావేశం గురువారం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, పాలకొండ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి కలమట సాగర్ పాల్గొని తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు పార్టీ వ్యూహాన్ని, రాబోయే కాలంలో పార్టీ అనుసరించ వలసిఉన్న ఉద్యమ పందాను రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడు సమావేశంలో మాట్లాడారు అని ఇక్కడ మీడియాకు సాగర్ తెలిపారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడుతో సాగర్ మర్యాద పూర్వకంగా కలిసారు.

సమస్యలుంటే తెలియజేయండి... పరిష్కరిస్తా : ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: గ్రామాలలో ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని నినాదం నా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటి పరిష్కారానికి తాను కృషి చేస్తే చేస్తానని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలో గల వసుంధర గ్రామంలో గురువారం నాడు రెండవ రోజు గడపగడపకు కార్యక్రమం లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని ఆదర్శంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలలో భాగస్వామ్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధి తదితర వాటిని గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జడ్పీటిసి గూడ ఎండయ్య, ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచు ఎస్. అప్పలనాయుడు,రవి, ఎంపీటీసీ సలాన జనార్ధన చిట్టి, జైమినిరావు, అనపాన రాజశేఖర్ రెడ్డి, నక్క బాబురావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను ఎస్పీ పరిశీలన

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్థానికంగా ఏర్పాటు చేసిన పోలీస్ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ జి. రాధిక బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, విక్టరి జూనియర్ కళాశాల, వంశధార విద్య సంస్థల్లో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాలను అమె పరిశీలించి సంబందిత విద్యా సంస్థల ప్రిన్సిపాల్‌లకు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాలల్లో ఎవ్వరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పరీక్షలు వ్రాసేందుకు సదుపాయాలు కల్పించాలని, ఎస్ఐ మినహా ఎవ్వరిని పరీక్ష కేంద్రాలలోకి అనుమతించరాదని అమె సూచించారు. అభ్యార్థులను గదులులోకి వంపించే ముందు ఒక చోట తనిఖీలు నిర్వహించి ఇతర ఎటువంటి సామగ్రిని అనుమతించరాదని అమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెతో పాటు పరీక్ష నోడల్ అధికారి జి. శ్రీనివాసరావు, స్థానిక ఎస్ఐ షేక్ ఖాదర్‌భాషా, చింతాడ అనిరుద్దుడు, తదితరులు పాల్గొన్నారు.

దోషులు ఎవరైనా విడిచిపెట్టేది లేదు : సీఐ

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మండలంలో గల దేగల పోలూరు గ్రామంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రక్కగా నివసిస్తున్న వారి ఇంట్లో చోరీకి పాల్పడి బంగారం, నగదు దోచుకోవడంతోపాటు వారికి గాయాలకు గురిచేసిన దోషులు ఎవరైనా విడిచి పెట్టేది లేదని పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్‌బాబు అన్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో గల దీనబంధుపురం పంచాయతీ పరిధిలోగల దేగలపొలూరు గ్రామానికి చెందిన సేనాపతి దుర్యోధన ఇంటిపై బుధవారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు తుపాకిని చూపి, కత్తితో దాడిచేసి కొంత మొత్తం నగదును, బంగారంను అపహరించుకు వెళ్ళారని, అనంతరం స్థానికులు, బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి పాతపట్నం సీఐ వినోద్‌బాబు, ఇన్చార్జి ఎస్సై కామేశ్వరరావు వచ్చి పరిశీలించారు. అయితే ఇదిలా ఉండగా గురువారం ఉదయం శ్రీకాకుళం జిల్లా సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ సీఐ జీవి రమణ, క్లూస్ టీమ్ ఎస్సై భరత్ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడి వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో బాధితులపై దాడికి సంబంధిత నిందితులు విడిచిపెట్టిన వస్తువుతోపాటు ఇతర వస్తువులపై వారి గుర్తులను సేకరించి తదుపరి ప్రత్యక్ష సాక్షిగానున్న సవర పార్వతమ్మను విచారించి జరిగిన సంఘటనను గూర్చి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పాతపట్నం సీఐ వినోద్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ నిందితులకు సంబంధిత గుర్తులను సేకరించడం జరిగిందని బాధితులు తెలుపుతున్న వివరాలు మేరకు చోరీకి పాల్పడిన వారు ఒడిశా వాసులు అయ్యే అవకాశం ఉందంటూ అనుమానాలను వ్యక్తపరిచారు. కేసుపై మరింత సమగ్రంగా దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకుంటామన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి... విభజన హామీలు అమలు చేయాలి

ఏఐవైఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్

విశాలాంధ్ర-నరసన్నపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజన చేసిన కాంగ్రెస్ పార్టీ, విభజన అనంతరం రాష్ట్రానికి మొండిచేయి చూపించింది. అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజేపి ప్రభుత్వం హామీలు అమలులో సవతితల్లి ప్రేమ కనబరుస్తోంది. ఇలా కట్టుబట్టలతో రోడ్డున పడేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు రాజకీయ పార్టీలతో ఆడుకుంటున్న సంధర్భంలో సిపిఐ, సిపిఎంతో పాటు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నరసన్నపేట పట్టణంలో టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

విభజన హామీలపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలి - ఆర్.సురేష్‌బాబు, సిఐటియు జిల్లా సభ్యులు : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసపూరిత వాగ్దానాలు చేసిన బిజేపి ప్రభుత్వంతో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం విభజన హామీలపై పోరాడాలి. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తామని వేదికలపై హామీలు గుప్పించే కేంద్ర నాయకులు, విశాఖలో ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ రంగానికి అప్పగించటం ఎంతవరకూ సమంజసం. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన సిఎం, జగన్మోహన్‌రెడ్డి సమస్యను ప్రక్కదారి పట్టించకుండా, అన్ని రాజకీయ పార్టీల సహకారంతో, విద్యార్థి సంఘాల సహాయంతో పోరాటాలు ఉధృతం చేసి, ప్రత్యేక హోదా సాధనకు తీవ్రంగా కృషి చేయాలి.

మోడీ ప్రభుత్వానికి మోకరిల్లుతున్న జగన్మోహన్‌రెడ్డి - గొద్దు చిట్టిబాబు, టిడిపి అధికార ప్రతినిధి :
కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి సిఎం, జగన్మోహన్ రెడ్డి మోకరిల్లుతున్నారని, రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టారని టిడిపి జిల్లా అధికార ప్రతనిధి, గొద్దు చిట్టిబాబు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళటంలో జగన్ విఫలమయ్యారు. 5కోట్ల ఆంధ్రులను మోసగించిన బిజేపి, వైసిపి ప్రభుత్వాలను వచ్చే ఎన్నికల్లో గద్దె దించాల్సిన అవసరం వుంది.

ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం కాదు - ఎం.యుగంధర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి
ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం కాదు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేంతవరకూ ఉద్యమిస్తాం. హిందూపురంలో శుక్రవారం ప్రారంభమయ్యే బస్సు యాత్ర శ్రీకాకుళం జిల్లాలో వచ్చే ఫిబ్రవరిలో బస్సు యాత్ర ముగింపు సభను సుమారు 5వేల మంది విద్యార్థులతో ఇచ్ఛాపురంలో జయప్రదం చేయటానికి చలసాని శ్రీనివాస్, రామకృష్ణ కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

రాజకీయలకు అతీతంగా ప్రత్యేక హోదా సాధించాలి - జి.నర్సునాయుడు : ప్రత్యేక హోదాపై అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలి. భావి తరాలను దృష్టిలో పెట్టుకొని గత ఏడు సంవత్సరాల నుండి చేస్తున్న ఉద్యమాలను దృష్టిలో వుంచుకొని కేంద్రం ఆంధ్రాకు ప్రత్యేక హెూదా ఇవ్వని పక్షంలో ప్రత్యేక నిధులు కేటాయించాలి. హిందుపురం నుండి ఇఛ్ఛాపురం వరకూ సుమారు 16రోజుల పాటు నిర్వహించే బస్సు యాత్రకు ప్రతీ ఇంటి నుండి ఒక వ్యక్తి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. తీర, గిరిజిన, వ్యవసాయ, ఉద్దాన, గనుల ప్రాంతం వున్న ఉత్తరాంధ్రను అభివృద్ధి మార్గాన పయనింపచేసే విధంగా రాజకీయ నాయకులు ముందుకు రావాలి.

ఎక్కడి ధాన్యం అక్కడే!!

- మందకొడిగా సేకరణ
- బ్యాంక్ గ్యారెంటీలు లేవంటూ కొనసాగుతున్న జాప్యం
- తీవ్ర ఆందోళనలో రైతన్నలు

విశాలాంధ్ర-సోంపేట : ఆరుగాలం శ్రమించి పెట్టుబడుల కోసం అప్పులపాలై పంట చేతికొచ్చాక అమ్ముకుందామన్నా అవకాశం లేకుండా పోతుంది. ఒకవైపు అప్పులపాలై మరోవైపు సంక్రాంతి ఖర్చులకు కూడా ఇబ్బందుల పాలై తమ పొలాల్లో పొందిన ధాన్యాన్ని సరిగ్గా అమ్ముకోలేక నానా అవస్థలు అన్నదాతలకు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి శాపంగా మారింది. సోంపేట చుట్టుప్రక్కల మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈఏడాది కొనుగోలు చేసే విధానం అట్టర్ ప్లాప్‌గా మారింది. ఈ ప్రక్రియలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతాంగానికి ఏ మాత్రం మింగుడు పడడం లేదు. దీంతో మిల్లులకు చేర్చాల్సిన ధాన్యం వారాల కొలది పొలాల్లోనే ఉండిపోయి అడవి పందుల బెడదతో రైతులు మరింత నష్టాలు చవి చూడాల్సి వస్తోంది. మరోవైపు రైస్‌మిల్లర్లు రైతుల నుంచి సేకరించాల్సిన ధాన్యం కోసం ప్రభుత్వానికి ఇచ్చే బ్యాంక్ గ్యారెంటీలను స్వల్ప మొత్తంలో ఇవ్వడం, అవి రెండు మూడురోజులకే పరిధి దాటి పోవడంతో రైతులు ధాన్యాన్ని తరలించే పరిస్థితి లేకుండా దీర్ఘాలోచనలో పడుతున్నారు. దీనిపై తరచూ సమీక్ష సమావేశాలు జరుగుతున్నా ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో రైతులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రతి రైతు పొలంలోను ఇప్పటి వరకు ధాన్యం నిల్వ ఉండిపోవడం అనేక మంది రైతులు నత్తనడకన సాగుతున్న ఈ పరిస్థితిని చూసి నూర్పులు కూడా వేయకపోవడం గమనార్హం. ఇటీవల జరిగిన సంక్రాంతికి కూడా ధాన్యంపై డబ్బులిచ్చే నాథుడు లేక రైతు కుటుంబాలు పడిన ఇబ్బందులతో వారికి సంక్రాంతి చప్పగానే సాగిందని చెప్పాలి. ఇదిలా ఉండగా కంచిలి, సోంపేట మండలాలకు చెందిన రైతులు ధాన్యాన్ని ఆర్‌బికెలలో సుదూరంగా ఉన్న నందిగాం మండలానికి తరలించాలని సమాచారం రావడంతో రైతులు తెల్లముఖం వేస్తున్నారు. ఇటువంటి గడ్డుపరిస్థితులు ఎన్నడూ చూడలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇటువంటి నత్తనడకన సాగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రైవేటు దళారులకు వరంగం మారింది. రైతులకు నష్టం రాకుండా మార్కెట్ ధరను పూర్తిగా చెల్లించేలా ప్రభుత్వం తీసుకున్న ఇటువంటి విధానంలో ధాన్యంకొనుగోళ్లు నత్తనడకన సాగు తుండడంతో చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వపరంగా ధాన్యం విక్రయాలకు స్వస్తి పలుకుతూ దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. ఏదిఏమైనప్పటికి ఈ విషయంలో ప్రభుత్వ విధానం విఫలమై రైతన్నల ఆశలు అడియాశలయ్యాయని ప్రతి ఒక్కరు పేర్కొంటున్నారు.

నూకలూరులో వేరుశెనగపై వైఎస్సార్ పొలంబడి

విశాలాంధ్ర-సోంపేట : బారువ రైతు భరోసా కేంద్రం పరిధిలోని నూకలూరు గ్రామంలో వేరుశనగ మీద డాక్టర్ వైఎస్సార్ పొలంబడిని వ్యవసాయ సహాయకులు పవిత్ర, లోలాక్షిలతో కలిసి మండల వ్యవసాయాధికారి సందర్శించారు. నాటిన 25-30 రోజుల్లో నీరు పెట్టినప్పుడు కాండం కుళ్లు తెగులు సాధారణంగా కనిపిస్తుందని, దీనికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొదలు పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేయాలని సూచించారు. మినుము, మిరప పంటల మీద ఆశించిన చీడపీడలు నివారణకు పలు సూచనలు చేశారు. రైతులు నూకల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్మీ క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాశీబుగ్గ రైల్వే ఎల్.సి గేటు సమీపం ఆర్మీ క్యాంటిన్ ఈ నెల 20వ తేదీ ప్రారంభిస్తారని మాజీ సైనిక సంఘం జాయింట్ సెక్రటరీ అట్టాడ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంటిన్‌ను మాజీ సైనికులందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సహజవనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ప్రసాదించిన సహజ వనరులను కాపాడుకోవలిసిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఆ దిశగా అడుగులు ప్రతీ ఒక్కరూ వేయాలని, తద్వారా రాబోయే తరాలకు మనం కాలుష్య రహిత సమాజాన్ని అందించేందుకు అవకాశం ఉంటుందని కలకత్తాకు చెందిన సైకిల్ యాత్రికులు ఆశిమ్, మింటూలు చెప్పారు. గురువారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల జాతీయ రహదారిపై తమిళనాడు వైపు వెళ్తున్న వీరిని మీడియా బృందం సభ్యులు కలుసుకొని అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జర్నీ విత్ మ్యూజిక్ పేరుతో ఏర్పాటు చేసుకున్న యుట్యూబ్ ఛానల్ ప్రతినిధులుగా మ్యూజిక్ మధ్య మధ్యలో వింటూ భారత్ యాత్ర చేపట్టామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు కాలుష్య రహిత సమాజాన్ని ఆవిష్కరించేందుకు తమవంతు ప్రచారం చేపడుతున్నామని అన్నారు. సుమారు ఏడాది కాలంలో భారత్ యాత్ర పూర్తి చేస్తామని చివరిగా లడక్ చేరుకొని అక్కడ నుంచి తిరిగి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ మీదుగా వెస్ట్ బెంగాల్ చేరుకుంటామన్నారు. సేవ్ యువర్ వరల్డ్ ఇన్ యువర్ ఓన్ వే... నినాదంతో భారత్ యాత్ర సాగుతుందని వెల్లడించారు.

గులి రాగి పద్ధతిలో చోడినాట్లు వేయడం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మండలం రొణంకి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులు చోడి పంటను మార్కర్ విధానంలో నాట్లు వేశారు. ఇందులో ప్రతి మొనకి మధ్య ఒక అడుగు దూరం, లైన్లో నాట్లు వేశారు. మామూలుగా వేసే చోడి పంటకు ఈ గులీ పద్ధతిలో వేసే రాగి పంటకు దిగుబడిలో వ్యత్యాసం ఉంటుందని, ఈ పద్ధతిలో పండిస్తే ఎకరాకు 3 క్వింటాలు అధికంగా దిగుబడి వస్తుందని మరియు ప్రకృతి సేద్య విధానంలో రాగి పంట ను పండించడం వలన రైతులకి పెట్టుబడి ఖర్చు కూడా చాలా తక్కువ అవుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్, కల్పన, ఈశ్వర్ లు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ లక్ష్మునాయుడు, సింగుపురం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా కవి వేమన జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : తన పద్యాలు తాత్పర్యంతో ప్రజలను మెప్పించిన మహా కవి వేమన అని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక కొనియాడారు. గురువారం వేమన జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వేమన మహా కవిని ఉద్దేశించి మాట్లాడుతూ తన యొక్క పద్యాలు ద్వారా ఎంతోమందిలో వెలుగులు నింపిన మహానుభావుడు అన్నారు. వేమన పండితుడు గొప్ప సంఘసంస్కర్త ఆయన యొక్క పద్యాలు నేటికీ ఎంతో ఆదర్శమైనవని ఎస్పీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎం వి నాగమణి కేకంత, అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, డీఎస్పీలు, సిఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో : నేటి తరానికి యోగి వేమన వాక్యాలు ఎంతో అవసరమని, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి అన్నారు. సంత

బొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు, యోగి వేమన జయంతి వేడుకలు జడ్పీటీసీ పాల వసంతరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 17వ శతాబ్దివాడైనా యోగి వేమన వేమారెడ్డిగా జన్మించి, 5000 ఆటవెలది పద్యాయలను రచించి, ఈటెలుగా జనం గుండెల్లోకి విసిరి ప్రజా కవిగా రూపొందిన ఘనత ఆయనదేనని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క భీమారావు, సర్పంచులు పాల మహేష్ రెడ్డి, ముదిలి సంజీవ్, గుజ్జు వెంకట్ రెడ్డి మాస్టర్, రోకల్లా రాజు ల్, యర్రయ్య, పిన్నింటి ఎండయ్య రెడ్డి, నూకరాజు, ప్రజలు, వైకాపా పార్టీ కార్యకర్తలు, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సవరపేట విద్యార్థికి ప్రథమ బహుమతి

సంతబొమ్మాళి మండలం గోవింద పురం పాఠశాలకు చెందిన విద్యార్థికి, వివేకానంద స్వామి జయంతి ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లి అప్పన్న చేతులు మీదుగా అందుకున్నారు. ఇటీవల బోరుభద్ర వివేకానంద విద్యాలయంలో, డైరెక్టర్ సూర్యం ఆధ్వర్యంలో నిర్వహించిన వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన పోటీలలో బహుమతి పొందారు. కార్యక్రమంలో ఎంఇఓ జలుమూరు చిన్నవాడు, సర్పంచ్ లు బుసకల లక్ష్మీ కాంతం లక్ష్మయ్య, పరపటి. సునీత శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ ప్రతినిధి చింతాడ చిన్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాసలో : మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగి వేమన జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యోగి వేమనగా ప్రసిద్ధి చెందిన వేమన తెలుగు భాషలో భారతీయ తత్వవేత్త, కవి అని, కవితల సరళమైన భాష, స్థానిక యాసలను ఉపయోగించడం వలన ప్రసిద్ధి చెందారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు, పాఠశాల సిబ్బంది ఎస్.విరమణారావు, కొయ్యల శ్రీనివాసరావు, జనార్ధనరావు, పద్మ, శివప్రసాద్, యామిని, వాసంతి, కిశోర్, భీమశంకర్, అరుణకుమారి, కృష్ణవేణిలు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో : వేమన పద్యాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన సమాజానికి మేల్కోపేలా ఉన్నాయని చెప్పారు. ద్విశతావధాని డాక్టర్ మరడాన శ్రీనివాసరావు వేమన జననం, మకుటం, కులవ్యతిరేకత, హేతువాదం, అన్నదానం గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ కళ్లేపల్లి ఉదయకిరణ్, డాక్టర్ యు.శాంతి, బలరాంనాయుడు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

72 కేంద్రాల్లో పోలీసు కానిస్టేబుల్స్ నియామక ప్రిలిమినరీ పరీక్ష

- అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి హాజరుకావాలి
- ఎస్పీ జి.ఆర్. రాధిక

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లాలో 72 కేంద్రాల్లో పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు సంబందించి 19. ఈనెల 22వ తేదీన ఉదయం శ్రీకాకుళం, టెక్కలి కేంద్రంగా నిర్వహించబోయే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షాకేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్త్, ఇతర ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని జిల్లా ఎస్పీ శ్రీమతి జి.ఆర్.రాధిక తెలిపారు. ఈమేరకు గురువారం ఉదయం ఎచ్చెర్ల శివాని ఇంజినీర్ కళాశాలలో నిర్వహించిన పత్రిక సమావేశంలో కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహణపై తీసుకోనున్న చర్యలు ఎస్పీ వెల్లడించారు. అంతకుముందు శివాని కళాశాల కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ అధ్యక్షతన, (చీఫ్ కోఆర్డినేటర్) చీఫ్ ఇన్ విజిలెటర్స్ సూపర్నెంట్స్, పోలీసు అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 22-01-23వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రీలిమినరీ రాత పరీక్ష జిల్లాలో మొత్తం 72 సెంటర్లలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సెంటర్లకు అభ్యర్థులను అనుమతిస్తారని ఉదయం 10 గంటలకి ఒక నిమిషం దాటినా అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని కాబట్టి అభ్యర్థులందరూ సమయాన్ని గమనించి పరీక్షా కేంద్రం వద్దకు ముందుగా రావాలని తెలియజేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు తావులేకుండా పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 72 కేంద్రాలలో శ్రీకాకుళం, టెక్కలి రీజనల్ వారీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ఆయా పరిధిలోని పరిక్షా కేంద్రాలను సంబంధిత పోలీసు అధికారులు తనిఖీ చేశారని పేర్కొన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో అభ్యర్థులకు సౌకర్యాలు ఏర్పాట్లు జరుగుతున్నాయి అని అన్నారు.ఆదివారం ఉదయం 10 గంటల నుండీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరి పరీక్షలు శ్రీకాకుళం రీజియన్ పరిధిలోని శ్రీకాకుళం టౌన్, రూరల్, ఎచ్చెర్ల పొందూరు, టెక్కలి రీజియన్ పరిధిలోని టెక్కలి ఐతం, నరసన్నపట, కాశీబుగ్గ, కోటొమ్మాళి కేంద్రాలుగా మొత్తం 72 పరీక్షా కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. జిల్లాకు చెందిన మొత్తం 23,735 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగ పురుషులు 18151, మహిళలు 5584హాజరు కానున్నారని తెలిపారు.పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కెమెరాల పర్యవేక్షణలో ఉంటుంది అని తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులోకి వస్తుంది అని తెలిపారు.అభ్యర్థులు ఖచ్చితంగా నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని ఎటువంటి మాల్ ప్రాక్టీసు కు పాల్పడ్డద్దుని అట్టి వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరీక్ష జరుగుతున్న ప్రతి సెంటర్ వద్ద పటిష్టమైన పోలీసు సిబ్బందితో పాటు అదనంగా రక్షక్ మొబైల్స్, రూట్ బందోబస్తును, ఫ్లయింగ్ స్క్వాడ్,డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేస్తాన్నమని తెలిపారు.పరీక్ష కేంద్రానికి వెళ్ళే అభ్యర్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఆర్టిసి బస్సులు తో పాటుగ అవసరమైన ఆటోలును అందుబాటులో ఉంటాయిన్నారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది,ప్రతి పరీక్ష కేంద్రానికి వెళ్ళే అభ్యర్థులు హాల్ టికెట్ తోపాటు ఎదైనా ఒక ఒరిజినల్ ఐడెంటిటీ కార్డు ద్వారా మాత్రమే పరీక్ష హాలులో అనుమతి ఇస్తారు కాబట్టి పరీక్ష కేంద్రానికి సరియైన సమయంలో హాజరు కావాలని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులకు ముఖ్య విజ్ఞప్తి పరీక్ష కేంద్రానికి వచ్చేటప్పుడు హాల్ టికెట్, ఒరిజినల్ గవర్నమెంట్ వారు జారీ చేసిన ఐడి కార్డు, బ్లాకు లేదా బ్లూ పాయింట్ పెన్,వాటిని మాత్రమే అనుమతిస్తారు ఈ పరీక్ష కేంద్రాల్లో రాత పరీక్ష రాయుటకు వచ్చే అభ్యర్థులు ఎలక్ట్రాన్ పరికరాలు గాని మొబైల్ ఫోన్స్,స్మార్ట్ వాచ్, క్యాల్కులేటర్, ఇతర విలువైన వస్తువులు గాని అనుమతించబడవు కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాల్లో జిరాక్స్ షాపులు మూసివేయాలని, కేంద్రాల వద్ద జనం గుంపులు గుంపులుగా ఉండకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి వివిఠలేశ్వర్, పరీక్ష నోడల్ అధికారిణి డీఎస్పీ జి. ప్రేమ్ కాజాల్, డివిస్పీలు ఎం.మహేంద్ర,జి శ్రీనివాసరావు, ప్రసాద్ రావు, ఎస్. బాలరాజు, రీజనల్ కో ఆర్డినటర్ లు ఏ. శ్రీనివాసరావు, వై శ్రీనివాసరావు, ఇతర ముఖ్య పోలీసు అధికారులు చీఫ్ ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు భద్రతా నియమాలను పాటించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: వాహనదారులు రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత పక్షోత్సవాలు-2023లో భాగంగా రహదారి భద్రతా వారోత్సవాలు ఈనెల 18వ తేది నుండి 24వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనం నడిపినా, మైనర్లు వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. 18 ఏళ్ల దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్సులను తీసుకోవాలన్నారు. వాహనాలు కండీషన్లో ఉండక పోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నా యన్నారు. చాల చోట్ల బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి సేఫ్టీ స్పాట్స్ గా మార్చడం జరిగిందన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలుగు తున్నామన్నారు. అధిక రోడ్డు ప్రమాదాలు ప్రయాణంలో మొబైల్ వాడకం, మద్యపానం, అతి వేగం వలన జరుగుతున్నా యని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని కోరారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని రహదారి భద్రతా, రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవా లన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో డిటిసి శ్రీదేవి, ఆర్టీఓ దుర్గాప్రసాద్ రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి రక్తదాతలే రేపటి ప్రాణదాతలు

- సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ, అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ త్రైక్వాండో శ్రీను

విశాలాంధ్ర-అరసవల్లి : నేటి రక్తదాతలే రేపటి నిజమైన ప్రాణదాతలని సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ, అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ త్రైక్వాండో శ్రీనులు పేర్కొన్నారు. ఒకరు చేసే రక్తదానం మరికొందరి ప్రాణాలను నిలిపేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. మెగా కుటుంబ వారసుడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ పుట్టిన రోజు సందర్భంగా టీం వరుణ్ తేజ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో గురువారం న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వారిద్దరూ కలిసి పాల్గొన్నారు. మెగా అభిమానులతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన టీం వరుణ్ తేజ్ శ్రీకాకుళం అధ్యక్షుడు శీర రాజు ఇతర ప్రతినిధులను, యువతను అభినందించారు. టీం వరుణ్ తేజ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రైక్వాండో శ్రీను మాట్లాడుతూ మెగా స్టార్ చిరంజీవి ఫ్యామిలీ అభిమానులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గడిచిన అనేక సంవత్సరాలుగా మెగా అభిమానులు క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తదానం చేస్తూ వేలాది మంది ప్రాణాలను నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి వైశ్యరాజు మోహన్ , టీం వరుణ్ తేజ్ అధ్యక్షుడు శీర రాజు ,ప్రతినిధి పంకు మురళీ, పవన్ కళ్యాణ్ యువత ప్రతినిధులు గొర్లె కిరణ్ కుమార్, పెయ్యల చంటి, సంతోష్ ,రామ్ చరణ్ యువత అధ్యక్షుడు త్రైక్వాండో గౌతం, తేజ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షుడు పుక్కల నవీన్, ప్రతినిధులు భాను, బన్ని, నాని, సాయిధరమ్ తేజ్ యువత అధ్యక్షుడు జోగిపాటి వంశీ లతో పాటు మెగా ఫ్యామిలీ పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో టీం వరుణ్ తేజ్ ప్రతినిధులు తమ అభిమాన నటుడు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ప్రజల నమ్మకాన్ని చురగొనాలి

విద్యావేత్త, నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ప్రజలకు సేవ చేయాలంటే పదవులే అక్కర్లేదని, అయితే ఒక బాధ్యత గల స్థానంలో ఉంటే మనం మన ప్రాంత అభివృద్ధితో పాటు పదిమందికి సేవ చేసే భాగ్యం కలుగుతుందని ఆ దశగా ప్రజల నమ్మకాన్ని చురగొనాలని విద్యావేత్త, నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మండలంలో గల నిర్వాసిత గ్రామమైన చీపురుపల్లి గ్రామంలో గురువారం నాడు గ్రామస్తులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ చీపురుపల్లి నిర్వాసిత గ్రామ ప్రజల సమస్య పరిష్కారానికై ఇప్పటివరకు అవలంబించిన విధానాల వల్ల సమస్య పరిష్కారంలో జాప్యం జరిగినట్టుగా కనిపిస్తుందని తెలియజేస్తూనే నిర్వాసిత గ్రామాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం చేయాల్సిన సంబంధిత రెవెన్యూ శాఖ మంత్రి ఈ జిల్లాకు చెందిన వారై ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. ఏ గ్రామంలోనైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి బాధ్యత గల స్థానాల్లో ఉన్న మనం కార్యచరణతో ముందుకు సాగాలని, మన దగ్గరే కార్యాచరణ లేకుంటే సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయని, ప్రజలకు మనం ఎప్పుడు న్యాయం చేయగలమని తెలియజేస్తూనే, మనమంతా సమిష్టిగా ఉంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కారం చేసుకోగలమని తెలియజేస్తూనే, రెవెన్యూ శాఖ మంత్రి వారి దృష్టికి నియోజకవర్గంలో ఉన్న సమస్యలు తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేయడం జరుగుతుందని ఈ సంద ర్భంగా ఆయన ప్రజలతో వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం ఆఫ్షోర్ రిజర్వాయర్ నిర్మాణం జరగనున్న ప్రాంతాన్ని స్థానికులతో కలిసి వెళ్లి పరిశీలించారు. టెక్కలిపట్నంలో గ్రామానికి ఆనుకుని చీపురుపల్లి నిర్వాసిత ప్రజలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను సందర్శించి, అక్కడ నిర్వాసిత ప్రజలకు సరైన మౌలిక సదుపాయాలు గురించి తెలుసు కున్నారు. సిరిపురం తేజేశ్వరరావు తోపాటు స్థానిక సర్పంచ్ యావ్వరి ఈశ్వరరావు, ఉప సర్పంచ్ పిట్ట సవరయ్య, తెప్ప శ్యాంసుందర రావు, చాపర సోమేశ్వరరావు, ఎన్. కృష్ణారావు, ఏ. బాలాజీ, ఏ. కిట్టయ్య, లింగయ్య మాష్టర్, చిరంజీవులు, నాగరాజు, గ్రామస్తులు తదితరులున్నారు.

ప్రతిఇంటికి ఇంటెర్నెట్ సౌఖర్యం అందించడమే లక్ష్యం

ఎ.పి.ఎస్.ఎఫ్.ఎల్. ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ పిల్లా జగన్మోహనరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌఖర్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎ.పి ఫైబర్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ పిల్లా జగన్మోహనరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎ.పి ఫైబర్ కేబుల్ ఆపరేటర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన రెడ్డి ఆదేశాలమేరకు ఎ.పి ఫైబర్ గ్రిడ్‌ను మరింత విస్తృతం చేసి, పటిష్టం చేసామని అన్నారు. ప్రతి గ్రామ సచివాలయంకు ఫైబర్ లైన్‌లు వేసామని, అక్కడ ఆప్టికల్ లైన్ ట్రాన్సిమిటర్ లను అమర్చనున్నట్టు తెలిపారు. దీనివలన మారుమూల గ్రామీణ ప్రాంతం లోని ఇంటర్నెట్ సౌఖర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇళ్లకు ఇంటర్నెట్ కనక్షన్ నెలకు కనిష్టంగా 190 రూపాయిల నుండి వివిధ ప్యాక్‌లలో అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలో ఏ.పి ఫైబర్ మాత్రమే టి.వి. ఛానల్స్, ఇంటర్నెట్, టెలిఫోన్ సౌఖర్యాలతో కూడిని ట్రిపుల్ ప్లే సర్వీసులను అత్యంత నాణ్యంగా అందిస్తున్నామన్నారు. భవిష్యత్ లో 80లక్షల ఇళ్లకు సర్వీసులు అందివ్వడానికి లక్ష్యం ఏర్పరుచు కున్నామన్నారు. ఇందుకు కావలసిన సెట్‌టాప్ బాక్స్‌లు, ఇతర పరికరాలు సంస్థ సమకూర్చుతోంద న్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడానికి క్షేత్రస్థాయిలో ఉన్న కేబుల్ ఆపరేటర్‌లు సహకరించి, ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎ.పి ఫైబర్ సేవలను విస్తరించాలని కోరారు. ఈ సంధర్బంగా కేబుల్ ఆపరేటర్‌లు నెట్ వర్క్‌లో ఎదురవుతున్న బిల్లింగ్ సమస్యలు, సాంకేతిక సమస్యలు, నెట్ వర్క్ విస్తరణకు కావలసిన పరికరాలు అవశ్యకతను ఇ.డి. జగన్మోహనరావు దృష్టికి తీసుకువెళ్లారు. కేబుల్ ఆపరేటర్‌ల సమస్యలు పరిష్కరించి, సూచనలు పరిగణనలోకి తీసుకుంటా మని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా మార్కెటింగ్ మేనేజర్ గౌతమ్ కుమార్, టెక్నికల్ మేనేజర్ వేణు ప్రసాద్, ఎంటర్ప్రిసెస్ మేనేజర్ సాయి కుమార్, జూనియర్ టెక్నికల్ మేనేజర్ జోగారావు, డీహెచ్‌క్యూ ఇంజనీర్ మురళి కృష్ణ, ఫైబర్ ఇంచార్జి సాయి కుమార్, తదితర ఏపీఎస్ఎఫ్ఎల్ జిల్లా స్టాఫ్‌తో పాటు జిల్లా నలుమూలల నుండి వచ్చిన కేబుల్ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

దేవాలయం సమీపంలో మద్యం దుకాణం

విశాలాంధ్ర-బూర్జ: మండలానికి చెందిన కొల్లివలసలో ప్రధాన కూడలి వద్ద రామాలయం మరియు క్రైస్తవ ఆరాధ్య స్థలం చర్చికి ఇరవై మీటర్ల కూతవేటు దూరంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు తగదని, వెంటనే ఎక్సైజ్ అధికారులు దుకాణాన్ని తరలించాలని ప్రజలు కోరుతున్నారు. పవిత్రమైన రామాలయం, చర్చి ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని ఏవిధంగా ఏర్పాటుచేశారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. పవిత్ర స్థలాలకు, విద్యాలయాలకు, ఆసుపత్రులకు వంద మీటర్ల దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చెయ్యాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ ఈ నిబంధనలు ప్రభుత్వ మద్యం దుకాణాలకు వర్తించవా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ప్రఖ్యాతి గాంచిన కొల్లివలస సంతకు ఎదురుగా ఈ దుకాణం ఏర్పాటు చెయ్యడంతో సంతకు వచ్చే మహిళలకు, భక్తులకు, చిన్న పిల్లలకు, స్థానికులకు ఇబ్బందికరంగా ఉంటుందని, వెంటనే పట్టణ శివార్లలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అధికారులు స్పందించి దుకాణాన్ని తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మూర్తిని ప్రశ్నించగా ఎండోమెంటు పరిధిలో ఉన్న దేవాలయాలకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు.

ఆశాజనకంగా అపరాల సాగు

విశాలాంధ్ర-జలుమూరు: మండలంలో ఈ ఏడాది అపరాల పంటల సాగు ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం, నగరికటకం, కొమనాపల్లి, అచ్యుతాపురం, మెట్టపేట, అల్లాడ, తిమడాం, జలుమూరు, జొనంకి తదితర గ్రామాల్లో అపరాల పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో అపరాల పంట సాగు జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

స్పెషల్ బీఈడీ కోర్సుకు ఆర్‌సీఐ గుర్తింపు కొనసాగింపు

వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వ హిస్తున్న రెండేళ్ల స్పెషల్ బీఈడీ కోర్సుకు రీహేబిటేషన్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ)గుర్తింపు మరో ఐదేళ్లు పొడి గిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడారు. ఆర్‌సీఐ నియమించిన బృందం ఇటీవల వర్సిటీని సందర్శించి కోర్సు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి, ఈ నిర్ణయం తీసుకుందన్నారు. వర్సిటీలో రెగ్యులర్ ప్రాతిపదికన పనిచేస్తున్న నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ కెరీర్ అడ్వాన్స్ స్కీమ్ (సీఏఎస్) వర్తింపజేశామని, కొద్ది రోజుల్లో వీరికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభిస్తుందని చెప్పారు. వర్సిటీలో ఇంజనీరింగ్, సైన్స్ ఆర్ట్స్ కళాశాలలో అవసరమైన బోధనా సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్సిటీలో 18 కోట్లతో నిర్మించిన పురుషుల వసతి గృహం భవనం పూర్తయిందని, అలాగే 33 కోట్లతో నిర్మిస్తున్న పరిపాలనా భవనం పనులను త్వరిత గతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్సిటీలో రెగ్యులర్ బోధనా సిబ్బంది, పరిశోధనా ప్రాజెక్ట్‌లను తీసుకవస్తే, అకడమిక్ అంశంలో వారికి మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. కాంట్రాక్ట్ బోధనా సిబ్బంది ఏడాదికి నిర్దేశించిన పరిశోధనా పత్రాలను జర్నల్స్‌లో ప్రచురించాలన్నారు.

గ్రామసారథుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చెయ్యండి

సచివాలయ కన్వీనర్ ఇన్‌చార్జ్ నాగభూషణరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : గ్రామసారథులు ఎంపిక ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని మండల సచి వాలయ కన్వీనర్ ఇన్‌చార్జ్ గద్దవలస నాగభూషణ రావు అన్నారు. ఆయన గురువారం మండల విఫ్ బొడ్డు అప్పన్నతో కలిసి మండలం అక్కయ్యవలస, కొత్తపేట పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించి ఎంపిక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామసారదులు ఎంపికకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వాలంటీర్లు సహకరించి త్వరగా ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు దుక్క రోజారామక్రిష్ణ, సర్పంచ్ సుకన్య, జనార్థన్‌రెడ్డి, శివారెడ్డి, బూత్ కన్వీనర్ మక్క అదినారాయణ, డొక్క వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర-పలాస : ఎల్ఐసి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలాస ఎల్ఐసి బ్రాంచ్ సంఘం అధ్యక్షులు పి.రాంబాబు, కార్యదర్శి ఎన్.సుబ్బారావు అన్నారు. గురువారం పలాస ఎల్ఐసి కార్యాలయం వద్ద జీవిత బీమా వ్యాపార జాతీయకరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో జీవిత బీమా రంగంలో ఉన్న 245 ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీ అన్నింటిని జాతీయం చేశారని చెప్పారు. ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలు పాలసీదారులు కష్టపడి సంపాదించిన పొదుపు మొత్తాన్ని దోచుకుంటున్నారన్నారు. 1956లో 5 కోట్ల రూపాయలతో ప్రారంభమైన ఎల్ఐసి ఇప్పుడు 42,30,617 కోట్లు ఆస్తులు, 37,3,760 కోట్ల లైఫ్ ఫండ్ కలిగి ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 14 దేశాల్లో ఎల్ఐసి తన కార్యాలయాలు కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే జీజీఎంపీ : స్పీకర్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వమనినాడు ప్రతిపక్ష నేత హోదాలో ప్రజల సమస్యలు తెలుసుకో వడానికి ప్రజాసంకల్ప పాదయాత్రకు ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం చీమలవలసలో గడపగడపకు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ మాట్లాడారు. ప్రజల సమస్య ప్రత్యక్షంగా చూశారన్నారు. ఈ మూడున్నర సంవత్సరా లలో ఇచ్చిన హామీలను 98శాతం నెరవేర్చారని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ అందిన పథకాలను వివరిస్తూ అధికారుల సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జడ్పిటిసి బెండి గోవిందరావు, స్థానిక నాయకులు పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, సర్పంచులు ఎంపీటీసీలు మొండేటి కుర్మారావు, ఢిల్లీ శ్వరరావు, గొంటి కృష్ణ, సైలాడ దాసు నాయుడు, కుటకుప్పల సన్యాసిరావు, చల్లా సింహాచలం, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.